క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం



విశేష అలంకరణలో బ్రాహ్మణగూడెం వేంకటేశ్వరస్వామి వారు

చాగల్లు: బ్రాహ్మణగూడెంలోని వేంకటేశ్వర స్వామి వారి వార్షిక కల్యాణ వేడుకను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి పూజ కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆనంద్ స్వరూప్

నల్లజర్ల: కొయ్యలగూడెం మండలం అంకాలగూడెంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన సొంగా రాజేష్ కుటుంబానికి నల్లజర్ల మండలం, చీపురుగూడేనికి చెందిన సామాజికవేత్త, అసిస్టెంట్ ప్రొఫెసర్ వసంతాడ ఆనంద్ స్వరూప్, ఉందుర్తి రమణ మహర్షి సోమవారం రూ.15,000 ఆర్థిక సాయం చేశారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి రాజేష్ కుటుంబాన్ని మరింతగా ఆదుకోవాలని వారిద్దరూ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గుళ్లపూడి సతీష్ గుప్తా, రాచర్ల సంజన ప్రణీత్, గెల్లా రాజామాస్టర్, బొల్లిపో మధుశేఖర్, కవిటి లలిత, పూసల సురేష్, బొందల శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళిత సేన జిల్లా అధ్యక్షుడిగా కలిదిండి



కలిదిండికి నియామక ఉత్తర్వులు అందిస్తున్న వ్యవస్థాపక అధ్యక్షుడు రవిప్రకాష్

నల్లజర్ల: దళితసేన జిల్లా అధ్యక్షుడిగా కలిదిండి శ్రీనివాస్‌ను నియమిస్తూ ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. నల్లజర్ల మండలం అనంతపల్లి శివారు కృష్ణమ్మగూడెంలో సోమవారం ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. కృష్ణమ్మగూడేనికి చెందిన కలిదిండి శ్రీనును ఈ సందర్భంగా నాయకులు పూలమాలలు వేసి అభినందించారు. దళితులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో దళితసేన పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు చీలిమోహనరావు, ఆ సంస్థ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

నిడదవోలు రూరల్: మండలంలోని పందలపర్రు శివారు రావివారిపాలెం వద్ద గోదావరి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ సోమవారం తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి గోదావరి నది నుంచి కొవ్వూరు మండలం సీతంపేటకు చెందిన గాజుల గంగాధర్ నాగు దుర్గా శివ, జెట్టి వెంకన్న, విజ్జేశ్వరానికి చెందిన తిక్కా దొరబాబులు లారీల్లో అక్రమంగా ఇసుక తరస్తున్నార. దీనిపై సమాచారం అందుకున్న వీఆర్వో సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురి వ్యక్తులను అరెస్ట్ చేసి రెండు క్వారీ లారీలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు ఐదు రోజుల అంతరాయం

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం–సత్యవాడ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్నందున మంగళవారం నుంచి శనివారం వరకూ ఐదు రోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో నిడదవోలు ఈఈ బి.వీరభద్రరావు సోమవారం తెలిపారు. మండలంలోని సత్యవాడ గ్రామంతో పాటు ఉండ్రాజవరం రైతులకు ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తామని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ అవసరాలకు ఉదయం 5 నుంచి 7.30 గంటల వరకూ, తిరిగి మధ్యాహ్నం 12.30 గంటల నుంచి విద్యుత్ సరాఫరా ఇచ్చేలా మార్పు చేశామన్నారు.

మొక్కజొన్న.. లాభాలు మిన్న

- రైతుకు లాభాల పంట
- మెట్ట ప్రాంతంలో రబీలో ఆరుతడి పంటగా సాగు
- ఎకరాకు 45 క్వింటాళ్ల దిగుబడి
- కొవ్వూరు డివిజన్‌లో 6, 371 ఎకరాల్లో సాగు



దేవరపల్లి మండలం గౌరీపట్నంలో రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్నలు

దేవరపల్లి: మొక్కజొన్నకు మార్కెట్లో డిమాండ్ ఏర్పడింది. వ్యాపారులు ఈ గింజలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఏటా రబీలో మొక్కజొన్నను రైతులు ఆరుతడి పంటగా సాగు చేసి మంచి దిగుబడులు సాధించడంతో ఆశించిన ఆదాయం లభిస్తోంది. దీంతో ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంట మొక్కజొన్న. బోర్ల కింద కూడా రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. విత్తనం వేసిన 120 నుంచి 130 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఖరీఫ్ వరి చేలు కోసిన తర్వాత భూముల్లో మొక్కజొన్న పంట వేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

ఈ ఏడాది రబీ సీజన్‌లో కొవ్వూరు డివిజన్‌లోని ఎనిమిది మండలాల్లో 6,371 ఎకరాల్లో మొక్కజొన్న వేశారు. నల్లజర్ల, గోపాలపురం, దేవరపల్లి, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి, నిడదవోలు, పెరవలి మండలాల్లో పంట సాగు చేశారు. నల్లజర్ల, గోపాలపురం మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. దేవరపల్లి మండలం పల్లంట్ల కేంద్రంగా మొక్కజొన్న ఎగుమతి చేస్తున్నారు. పలు ప్రైవేట్ కంపెనీలు రైతులతో పంట వేయించి విత్తనం కొనుగోలు చేస్తున్నాయి. ఎకరాకు సుమారు రూ. 80 వేల నుంచి రూ. లక్ష వరకూ ఆదాయం వస్తోంది. ఖర్చులు పోను నికర ఆదాయం రూ.60,000 వస్తోందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది అధిక వర్షాలకు పంట దెబ్బతినడం వల్ల పెట్టుపడి ఎక్కువైందని తెలిపారు. సాధారణంగా మొక్కజొన్న పంటను ఎక్కువగా కత్తెర పురుగు ఆశించి నాశనం చేస్తుంది. అయితే ఈ ఏడాది పురుగు బెడద లేకపోవడం, దిగుబడులు బాగా ఉండడంతో రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి. పండించిన పంటలో 80 శాతం విత్తనానికి కంపెనీలు కొనుగోలు చేస్తుండగా, మిగిలిన 20 శాతం కమర్షియల్ పంట.

సాగుకు రైతుల మొగ్గు



కొవ్వూరు డివిజన్‌లోని ఐదు మండలాల్లో రబీలో 6,371 ఎకరాల్లో మొక్కజొన్న వేశారు. మార్కెట్లో మొక్కజొన్నలకు గిరాకీ ఉంది. క్వింటాల్ రేటు రూ.2250 ఉంది. ఆరుతడి పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. గతేడాది క్వింటాల్ ధర రూ.2,500 పలికింది.

– పి.చంద్రశేఖర్, వ్యవసాయ ఏడీఏ, కొవ్వూరు

లాభసాటిగా పంట



మొక్కజొన్న దిగుబడులు బాగున్నాయి. ఎకరాకు 40 నుంచి 45 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. నేను పదెకరాల్లో మొక్కజొన్న వేశాను. ప్రస్తుతం కోత జరుగుతోంది. ఎకరాకు రూ.లక్ష ఆదాయం వచ్చింది. గింజలకు గిట్టుబాటు ధర వస్తోంది. మార్కెట్ సదుపాయం బాగుంది.

– అనిశెట్టి సూర్యచంద్రరావు, రైతు, యాదవోలు, దేవరపల్లి మండలం

కొవ్వూరు డివిజన్‌లో మొక్కజొన్న సాగు వివరాలిలా..

మండలం	సాగు విస్తీర్ణం ఎకరాల్లో
గోపాలపురం	3656
దేవరపల్లి	412
నల్లజర్ల	1306
కొవ్వూరు	122
చాగల్లు	50
నిడదవోలు	93
పెరవలి	9
తాళ్లపూడి	723
మొత్తం	6,371

ఆర్బీకేల ద్వారా కొనుగోలు

రైతులు పండించిన మొక్కజొన్నను రైతు భరోసా కేంద్రాల్లో మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ప్రతి ఆర్బీకే వద్దా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే కొనుగోలు కేంద్రాల వద్ద కంటే బయట మార్కెట్లో ఎక్కువ ధర లభించడంతో రైతులు బయట అమ్మకాలు జరుపుతున్నారు.

వరి తర్వాత ప్రధాన పంట

జిల్లాలో వరి తర్వాత ప్రధాన పంటగా రైతులు మొక్కజొన్న వేస్తున్నారు. ఖరీఫ్‌లో వరికోతలు పూర్తయిన అనంతరం రబీలో ఆరుతడి పంటగా మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. మొక్కజొన్నను చేపలు, కోళ్లు, పశువుల దాణాగాను, ఆహారంగాను, పేలాలు, స్వీట్‌కార్న్ రూపంలో వినియోగిస్తున్నారు.

మునిసిపల్ షాపుల అద్దెలు ఇంత చవకా?

- బినామీల పేరుతో వ్యాపారాలు
- విచారణకు లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్

కొవ్వూరు: పట్టణంలోని మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్సుల్లో షాపుల అద్దెలపై న్యాయ విచారణ జరిపి, అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొంతా శ్యాం రవి ప్రకాష్ డిమాండ్ చేశారు. ఒక్కో షాపును కేవలం రూ.775 నెలవారీ అద్దెకే కేటాయించడం వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. రోడ్డు మార్జిన్‌లో చిరు వ్యాపారాలు చేసుకునే వారు కూడా నెలకు రూ.3 వేల నుంచి రూ.6 వేల వరకూ ఆశీలు చెల్లిస్తున్నారని ఆయనన్నారు. అన్ని వసతులూ ఉన్న మునిసిపల్ షాపుల్లో మాత్రం నామమాత్రంగా అద్దెలు వసూలు చేస్తూ పురపాలక సంఘ ఆదాయానికి గండి కొడుతున్నారని రవిప్రకాష్ ఆరోపించారు. తక్కువ అద్దెకు మునిసిపల్ షాపును తీసుకుని, ఎక్కువ అద్దెకు మరొకరికి ఇవ్వడం మునిసిపల్ చట్ట ప్రకారం నేరమన్నారు. చట్ట ప్రకారం ఇలాంటి వారిపై లీజును రద్దు చేసే అధికారం ఉన్నప్పటికీ కూడా అధికారులు దృష్టి సారించక పోవడం శోచనీయం అన్నారు. బినామీల పేరుతో వ్యాపారాలు సాగిస్తుంటే, వారికి అధికారులు లంచాలు తీసుకుని సహకరిస్తున్నారని ఆరోపించారు. బినామీదారులు కోర్టుకు వెళ్లే అవకాశం అధికారులు ఇస్తున్నారని అన్నారు. ఇప్పటికైన మునిసిపల్ కమిషనర్ ఇటువంటి దుకాణాలపై దృష్టి సారించి అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని రవిప్రకాష్ డిమాండ్ చేశారు.

అట్టహాసంగా శ్రీనివాస్‌నాయుడి జన్మదిన వేడుకలు



మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడికి శుభాకాంక్షలు చెబుతున్న మునిసిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడి జన్మదిన వేడుకలను సోమవారం స్థానిక శాంతినగర్‌లోని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణుల ఆనందోత్సాహాల మధ్య అట్టహాసంగా నిర్వహించారు. నిడదవోలు పట్టణంతో పాటు నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తరలివచ్చి శ్రీనివాస్‌నాయుడికి పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, పార్టీ మండల కన్వీనర్ అయినీడి పల్లారావు, పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, ఎంపీపీలు తిరుమళ్ల భాగ్యలక్ష్మి, పాలాటి యల్లారేశ్వరి, కార్చెర్ల ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగన పోలయ్య, జెడ్పీటీసీ సభ్యులు కొయ్యే సూరిబాబు, నందిగం భాస్కరరామయ్య, కొమ్మిశెట్టి రామాంజని, జిల్లా వ్యవసాయ సలహామండలి మాజీ చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, పలువురు కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు శ్రీనివాస్‌నాయుడికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

నల్లజర్లలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నల్లజర్లలో సమావేశమైన ఇంటర్ పూర్వ విద్యార్థులు

నల్లజర్ల: స్థానిక ఎస్సార్‌కే కళాశాల 2007–08 బ్యాచ్ ఇంటర్ బైపీసీ గ్రూపు విద్యార్థుల ఆత్మీయ సమావేశం 17 ఏళ్ల తర్వాత అదే కళాశాలలో సోమవారం జరిగింది. పాత మిత్రలంతా ఒకచోట చేసి ఒకరినొకరు కుశల ప్రశ్నలు వేసుకుంటూ, అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొంటూ సందడి చేశారు. అప్పటి అధ్యాపకులు సోమయ్య, శ్రీనివాసరావు, ప్రసాద్, శాస్త్రి, హనుమంతులను సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక మధురానిభూతి మిగిల్చిందన్నారు. తొలుత ఇటీవల మృతి చెందిన కళాశాల చైర్మన్ కంఠమణి నారాయణ ప్రసాద్‌కు ఈ బృందం నివాళులర్పించింది.

గాలులకు నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

- గోపాలపురంలో నిలిచిపోయిన కరెంట్
- తీవ్ర అవస్థలు పడిన గ్రామస్తులు



గోపాలపురంలో కరెంట్ సరఫరాను పునరుద్ధరిస్తున్న సిబ్బంది

గోపాలపురం: ఆదివారం అర్ధరాత్రి వేళ బలంగా వీచిన ఈదురు గాలులు, వర్ష బీభత్సానికి చెట్లు నేలకొరిగాయి. ఫలితంగా గోపాలపురంలో ఎనిమిది విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దాంతో ఆదివారం అర్ధరాత్రి రెండు గంటల నుంచి సోమవారం రాత్రి 8 గంటల వరకూ కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దాంతో గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఒక పక్క ఉక్కపోత, మరో పక్క విద్యుత్ సరఫరా లేక చిన్నారులు, వృద్ధులు తల్లడిల్లిపోయారు. ఆదివారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం, భారీ ఈదురు గాలులకు జాతీయ రహదారిపై గోపాలపురంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ చెట్లు నేలకొరిగాయి. చెట్టు కొమ్మలు విరిగి పడడంతో స్థానిక టాక్సీ స్టాండ్ వద్ద గల నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరో నాలుగు స్తంభాలు విరిగిపోయినట్టు ఆ శాఖ అధికారులు తెలిపారు. దీంతో మరమ్మతులు చేయడానికి సుమారు 10 గంటల సమయం పట్టిందని తెలిపారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ



నల్లజర్ల ఉప్పర్ల కాలనీ వాసులకు ఆహార పొట్లాలు అందిస్తున్న ఎస్ఆర్‌కే సంస్థ సభ్యులు

నల్లజర్ల: స్థానికుడైన సాదే రవిభూషణ్ కుమారుడు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అజిత్‌భూషణ్ గతేడాది మృతి చెందాడు. అజిత్‌భూషణ్ జ్ఞాపకార్థం ఆయన సోదరుడు ఆశిష్ భూషణ్ ఎస్ఆర్‌కే ఆర్గనైజేషన్ అనే సంస్థను స్థాపించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం అజిత్ భూషణ్ పుట్టినరోజు సందర్భంగా పేదలకు వస్త్రదానం, అన్నదానం చేశారు. కార్యక్రమంలో సాదే రవిభూషణ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంపీ పురందేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మీ సేవా కేంద్రాల నిర్వాహకులు

రాజమహేంద్రవరం సిటీ: మీ సేవ కేంద్రాల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని రాజమహేంద్రవరం అర్బన్ మీసేవ సంక్షేమ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు అమిత్, రవి కోరారు. ఈ మేరకు సోమవారం వినతిపత్రం అందించారు. వృత్తి పరంగా తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మీసేవ కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

ఈ కారు ఎవరిదో!



రోడ్డు మధ్యలో ఉన్న కాలిపోయిన కారు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామపంచాయతీ పరిధిలోని హండ్రెడ్ ఫీట్ రోడ్డు నుంచి ఎస్‌టీపీ రోడ్డును కలుపుతూ నిర్మించిన రోడ్డుపై పూర్తిగా కాలిపోయిన కారు కొద్ది రోజులుగా అక్కడే ఉంది. ఈ నెల ఐదో తేదీ రాత్రి 8 గంటల సమయంలో ఈ కారు కాలిపోయినట్టు సమాచారం. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి మంటలను సైతం అదుపు చేశారు. కారులో ఉన్న వ్యక్తులు బయటకు దిగగానే మంటలు వ్యాప్తి చెందినట్లు తెలుస్తుంది. పెద్దగా జనసంచారం లేని ప్రాంతం కావడంతో కాలిన కారు రోడ్డుపైనే ఉండడంతో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంబంధిత పోలీసు అధికారులు రోడ్డుపై ఉన్న ఈ కారును పక్కకు తొలగించడమో, లేదా పోలీస్‌స్టేషన్‌కు తరలించాలని కోరుతున్నారు.

త్యాగానికి, దాన గుణానికి ప్రతీక బక్రీద్

- భక్తి శ్రద్ధలతో ముస్లింల బక్రీద్ ప్రార్థనలు
- పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్



నిడదవోలు ఈద్గాలో ముస్లింలతో కలసి సామూహిక బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్



సమిశ్రగూడెంలో నమాజులో పాల్గొన్న ముస్లింలు



కొవ్వూరు మండలం కాపవరం సాలార్ మసీదులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

నిడదవోలు: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్ మసీదు, చిన మసీదు, కురేషియా మసీదుల్లో ప్రత్యేక నమాజ్ చేశారు. స్థానిక యర్నగూడెం రోడ్డులో ఉన్న సున్నీ జామియా ఈద్గాలో జామియా మసీదు (పెదమసీదు) కమిటీ ఆధ్వర్యంలో వారు సామూహిక ప్రార్థనలు చేశారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ హాజరై ప్రార్థనలు చేశారు. ముస్లింలకు ఆయన బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ముస్లింలు తరలి వచ్చి బక్రీద్ నమాజ్‌లో పాల్గొన్నారు. అనంతరం వారు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, పెదమసీదు ముతవల్లీ అబ్దుల్ అజీజ్, కార్యదర్శి ఎండీ రోషన్, టీడీపీ, జనసేన పట్టణ శాఖల అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, నూర్ అహ్మద్‌షాషా, ఎస్‌కే వజీరుద్దీన్, షాజహన్, మత పెద్దలు, యువత పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: ప్రవక్త ఇబ్రహీం త్యాగ నిరతికి ప్రతీక బక్రీద్ పండగని పెద్ద మసీదు ముతవలీ మీరావుద్దీన్ షరీఫ్ అన్నారు. బక్రీద్ పండగను నిడదవోలు మండలంలోని సమిశ్రగూడెం షాదీఖానాలో, తాడిమళ్ల, కోరుమామిడి, పెండ్యాల మసీదుల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వారు తమ స్థోమతలను బట్టి ఖుర్బానీ సమర్పించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.

కొవ్వూరు: త్యాగానికి, దాన గుణానికి ప్రతీక బక్రీద్ అని ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని జామియా మసీదులోను, ఇందిరమ్మ కాలనీలోను, కాపవరంలోని సాలార్ మసీదులోను, గోవర్ధనగిరి మెట్టలోను ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఈ పర్వదినాన్ని నిర్వహించారు. నూతన వస్త్రాలు ధరించి మసీదులో ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు అలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలువురు పేద ముస్లింలకు నగదు దానం చేశారు.

తాళ్లపూడి: స్థానిక మస్‌జీద్ ఎ అబూబాకర్‌లో ముస్లింలు ప్రత్యేక నమాజు చేశారు. వేగేశ్వరపురంలోని మస్‌జీద్ ఏ నూర్ వద్ద, అన్నదేవరపేటలోను ప్రత్యేక నమాజు చేశారు. ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో తాళ్లపూడి మసీదు ప్రెసిడెంట్ అబ్దుల్ రహీమ్ సర్దార్ , అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని మసీదులన్నీ ముస్లింల ప్రార్థనలతో కళకళలాడాయి. ధారవరంలోని బిలాల్ మసీదులో బక్రీద్ పండగను ఘనంగా జరుపుకున్నారు. ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవుడు త్యాగాన్ని గమనిస్తాడని, అందరూ త్యాగం చేయడాన్ని అలవాటు చేసుకోవాలని పలువురు వక్తలు ప్రసంగించారు. చాగల్లు ఈద్గాలో బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. చాగల్లు జామియా మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం, వేలివెన్ను, మోర్త గ్రామాల్లోని మసీదులలో సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి ముస్లింలు ప్రార్థనలు చేశారు. బక్రీద్ పర్వదినం విశిష్టతను ముస్లిం మత పెద్దలు వారికి వివరించారు. ఈసందర్భంగా ముస్లింలకు జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి శరత్‌బాబుతో పాటు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

త్యాగమయ జీవితం బక్రీద్ సందేశం



నల్లజర్లలో ముస్లింలకు బక్రీద్ సందేశం ఇస్తున్న మత పెద్ద షేక్ సుభానీ

నల్లజర్ల: సృష్టి ఎంతో అద్భుతమైంది. ఎంత పరిశీలించినా.. శోధించినా అర్థం కానిది. అధ్యయనం చేయవలసింది ఇంకా ఎంతో ఉందనిపిస్తోంది. మానవుని ఆలోచనా పరిధికి మించి ఈ సృష్టిని నియంత్రించే శక్తి ఒకరికి ఉంటుంది. ఆ శక్తినే అల్లాహ్ (దైవం)అంటామని, ఆయన ప్రసాదించిన ఈ జీవితాన్ని ఆయన కోసం త్యాగం చేసేందుకు వెనకాడకూడదని బక ఈ బక్రీద్ సందేశమని మత గురువు షేక్ సుభానీ అన్నారు. నల్లజర్ల మీనార్ మసీదులో సోమవారం బక్రీద్ వేడుకలు నిర్వహించారు. ప్రవక్త ఇబ్రహీం త్యాగ నిరతి, సహనశీలత, రుజువర్తనను ఈ పండగ తెలుపుతుందన్నారు. కార్యక్రకమంలో మసీదు కమిటీ అధ్యక్షులు షేక్ రఫీ, ఎండీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

కంబాలచెరువు: ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకోవడమే లక్ష్యంగా గుడ్ ఫ్రెండ్స్ టీం ముందుకు వెళుతోందని వక్తలు అన్నారు. గుడ్ ఫ్రెండ్స్ టీం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం రాజమహేంద్రవరం అర్బన్‌తో పాటు పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదిత్య ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జీవీఎస్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సత్య సూర్య బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. టీం సభ్యులతో పాటు సుమారు 20 మంది వరకూ రక్తదానం చేశారు. గోకవరం బస్టాండ్, పుష్కరాలరేవు ప్రాంతాలతో పాటు ప్రభుత్వాసుపత్రిలో పేదలకు ఆహారాన్ని పంపిణీ చేశారు. మున్సిపల్ కాలనీలోని ప్రియదర్శిని ఆశ్రమంలో చిన్నారులకు భోజనం అందించారు. బధిర విద్యార్థుల మధ్యలో కేక్ కట్ చేశారు. టీం సభ్యులు మాట్లాడుతూ సోషల్ మీడియా ప్లాట్‌ఫాం వేదికగా ఫేస్‌బుక్ ద్వారా దేశవ్యాప్తంగా మిత్రులు, సేవాతత్పరులందరం కలిసి చారిటీ ప్రారంభించామన్నారు. దీనిద్వారా అన్ని వర్గాల వారికీ సేవ చేయాలనే నిర్ణయం తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో గుడ్ ఫ్రెండ్స్ అడ్మిన్ నాగచక్రం, సతీష్ కుమార్ (అడ్వకేట్), సూర్యప్రకాశ్, సురేష్ బుర్రే, ఆదిలక్ష్మి, స్వీటీ మాధురి తదితరులు పాల్గొన్నారు.